క్లుప్తంగా

క్రీడా పాఠశాలకు ఏడుగురు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ, తదితరులు

నెల్లిమర్ల: కడపలోని క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు సంబంధించి మండల స్థాయిలో గురువారం నిర్వహించిన పోటీల్లో ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించారు. పట్టణంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఎంపిక పోటీలు నిర్వహించారు. 5వ తరగతి విద్యార్థులు ఎస్. సాలెమ్, ఎం. గౌతమ్, ఎం. రూబెన్, ఎ. ప్రేమ్‌కుమార్, కె. మహేష్, జి. మహేష్, నాలుగో తరగతి విద్యార్థి టి. అశ్వినికుమార్ ఎంపికయ్యారు. వీరు జిల్లా స్థాయిలో నిర్వహించే ఎంపిక పోటీల్లో పాల్గొంటారని ఎంఎస్‌డీఓ జి. తవిటయ్య తెలిపారు. పీడీలు రామచంద్రుడు, జయకర్ జాన్సన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.

విత్తనాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

పూసపాటిరేగ: ఖరీఫ్ సీజన్‌కు (2023 – 24) సంబంధించి వరి విత్తనాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని మండల వ్యవసాయాధికారి కె. నీలిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో ఆధార్, ఫోన్ నంబర్లు తెలియజేసి విత్తనాలకు సంబంధించిన మొత్తాన్ని చెల్లించాలని పేర్కొన్నారు. ఎంటీయూ –1121 రకం 834 రుపాయలు, బీపీటీ –3291 రకం 819 రూపాయలు, బీపీటీ 5204 రకం 697 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.

అవార్డుల రద్దు తగదు

విజయనగరం అర్బన్: సైన్స్ అవార్డులను రద్దు చేయడం శాస్త్ర పురోగతికి అడ్డుకట్ట వేయడమేనని జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్ రంగాలలో అవార్డులను నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ తీసుకున్న నిర్ణయం సరికాదని, వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యువ శాస్త్రవేత్తలు, సైన్స్ టీచర్లకు ఇచ్చే 72 అవార్డులను రద్దు చేయడం అంటే వారిని అవమానించడమేనని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించుకోవాలని సూచించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

విజయనగరం పూల్‌బాగ్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక డీవీఈఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జె. రవికుమార్, ఎం. సౌమ్య, రమేష్, రాజు, లావణ్య, సమీరా, సోమేష్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇష్టం మేరకే ఆనర్స్ డిగ్రీ



మాట్లాడుతున్న మాన్సాస్ విద్యాసంస్థల ఇన్‌చార్జ్ కరెస్పాండెంట్ పీఎస్ సీతారామరావు

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ మేజర్, మైనర్ కోర్సులను విద్యార్థి ఇష్టం మేరకే చదువుకోవచ్చని మాన్సాస్ విద్యాసంస్థల ఇన్‌చార్జ్ కరెస్పాండెంట్, ప్రొఫెసర్ పీఎస్ సీతారామరావు అన్నారు. ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు స్థానిక మహారాజా అటానమస్ కళాశాలలో 'నాలుగు సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ మేజర్ / మైనర్ కోర్సులపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, రెండో సంవత్సరం పూర్తి చేసుకుంటే డిప్లమో.. మూడేళ్లు చేస్తే డిగ్రీ.. నాలుగు సంవత్సరాలు పూర్తి చేస్తే ఆనర్స్ డిగ్రీ ఇస్తారని చెప్పారు. పీజీ ఒక సంవత్సరం చేస్తే నేరుగా పీహెచ్‌డీ చేసుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమలో అడ్మిషన్స్ కమిటీ కో ఆర్డినేటర్ జి.చంద్రశేఖర్, కన్వీనర్లు పీఎస్ఎన్ రావు, వి.బాబ్జీ, అడిషన్స్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న అశోక్, ఫౌండేషన్ సభ్యులు

విజయనగరం: తిలక్ ఫౌండేషన్ సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రథమ లోక్‌సభ సభ్యుడు అయిన కందాళ సుబ్రహ్మణ్య తిలక్ పేరిట స్థాపించిన తిలక్ ఫౌండేషన్ ద్వారా గరివిడికి చెందిన అనాథ బాలిక వాగ్దేవికి ఈ ఏడాది చదువు నిమిత్తం ఇరవై వేల రూపాయల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా కేఎస్ తిలక్ పేద విద్యార్థుల చదువుకు తన జీవిత కాలమంతా ప్రోత్సాహాన్ని అందించి, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని గుర్తు చేశారు. ఫౌండేషన్ తరఫున ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ ఐఎస్ఎన్ రాజును అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, కార్యదర్శి కందాళ సాయిబాబ, కోశాధికారి విజయరామకృష్ణ, సభ్యులు ఎర్నాయుడు, రామచంద్రరాజు, కృష్ణమోహన్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్లు

విజయనగరం: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని, సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలోనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ అన్నారు. నగరంలోని 14వ డివిజన్ పరిధి కొత్తపేటలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, తదితరులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రావణి, లయాయాదవ్, రాజేష్, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై వివరించారు. అలాగే ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తూ, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగనన్న అవినీతి రహిత పాలన అందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిచిన దగ్గరనుంచి కోలగట్ల వీరభద్రస్వామి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. మరో మారు మనమంతా ఆయనకు మద్దతు పలికి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శోభార్గవి, నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్ బండారు ఆనందరావు, స్థానిక నాయకులు, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

● నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిదేనని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక జమ్ము నారాయణపురం వద్దనున్న మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉత్తమ ప్రతిభ చూపిన పదో తరగతి విద్యార్థులు నందకిశోర్, మణికంఠ, దివ్యలోచన పట్నాయక్‌లకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను ఇచ్చి సత్కరించారు. అనంతరం కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచుతున్న జగన్ మోహన్ రెడ్డి ఆదర్శప్రాయుడన్నారు. గతంలో దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలోనూ, ఆ తర్వాత ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హయాంలోనూ విద్యారంగం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. నాడు – నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపు రేఖలను మార్చారన్నారు. ప్రస్తుతం ర్యాంకులను సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని వచ్చే విద్యాసంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో నగర మేయర్ ముచ్చు లయాయాదవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శోభార్గవి, ప్రిన్సిపాల్ ఎం.శంకరరావు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ల సంఘ అభివృద్ధికి కృషి చేస్తాం

● సంఘమిత్ర ఆర్ఎస్ జాన్

విజయనగరం టౌన్: క్రైస్తవ సంఘాల అభ్యున్నతికి తాము పూర్తి స్థాయిలో కృషి చేస్తామని సంఘమిత్ర ఆర్ఎస్ జాన్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చ్‌స్ జోనల్ మీటింగ్ విశాఖ నగరంలోని ఆర్చ్ బిషప్ క్యాంపస్‌లో గురువారం ఉదయం నిర్వహించారన్నారు. సమావేశానికి ఏపీ క్రిస్టియన్ మైనారిటీ కమ్యూనిటీ ప్రభుత్వ సలహాదారులు, ఫాదర్ ముద్దు బాలస్వామి హాజరయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిషప్ కేజే ఫిలోమాన్, సంఘమిత్ర ఆర్ఎస్.జాన్‌లను జోనల్ రిప్రజెంటేటివ్‌లుగా ఎంపిక చేశారన్నారు. తాము త్వరలో సంఘ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిషప్ ప్రకాష్, రెవరెండ్ డేవిడ్ విక్టర్, విల్సన్‌బాబు, ఎంఎ నాయుడు, జై రత్నకుమార్, డీపీఆర్‌పీ కుమార్, జేమ్స్, కృపానంద్, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నగర పంచాయతీకి చెందిన ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పట్టణానికి చెందిన వార్డు వలంటీర్లంతా తమ క్లస్టర్లలోని అన్ని ఇళ్లను ఈ నెల 24వ తేదీ నుంచి సందర్శిస్తారన్నారు. కుల, ఆదాయ, మరణ, వివాహ, జనన, ధ్రువీకరణ పత్రాలతో పాటు మ్యుటేషన్ లావాదేవీలు, పంటసాగు హక్కు కార్డు, రైస్‌కార్డు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం, తదితర 11 రకాల సేవలను అందిస్తారన్నారు. వచ్చే నెల 4 నుంచి 22వ తేదీ వరకు 8 వార్డు సచివాలయాల్లో ఈ కార్యక్రమం చేపడతామని చెప్పారు. దీని నిమిత్తం ఇప్పటికే సచివాలయాల వారీగా వలంటీర్లు, కార్యదర్శులకు అవగాహన కల్పించామని తెలిపారు.

కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలు

నెల్లిమర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన కౌలు రైతులకు ప్రభుత్వం సాగుహక్కు పత్రాలను జారీ చేస్తుందని, అటువంటి వారిని వెంటనే గుర్తించాలని తహసీల్దార్ కేవీ రమణరాజు, ఏఓ పూర్ణిమ ఆదేశించారు. గురువారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేసే భూ సాగుహక్కు పత్రాల కోసం కౌలు రైతులను గుర్తించాలన్నారు. సదరు పత్రాలుంటే కౌలు రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవచ్చునన్నారు. అలాగే పంట నష్టపరిహారం, పంటల బీమా, బ్యాంకుల నుంచి రుణాలు కూడా పొందవచ్చునని చెప్పారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను కూడా పొందవచ్చని తెలిపారు. సాగుహక్కు పత్రం 11 నెలల వ్యవధి మాత్రమే కలిగి ఉంటుందని, గతంలో పొందిన వారు కూడా కొత్తగా పొందాలని సూచించారు.

మాదకద్రవ్యాల వినియోగంతో జీవితం నాశనం

● భోగాపురం సీఐ విజయ్‌నాథ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ విజయ్‌నాథ్



విజయనగరం క్రైమ్: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ తిరుపతిరావు

డెంకాడ: మాదకద్రవ్యాల వినియోగించినా, రవాణా చేసిన జీవితం నాశనమైనట్లేనని భోగాపురం సీఐ విజయ్‌నాథ్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ బారిన పడితే శారీరకంగా, మానసికంగా నష్టపోతామని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితిలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీవితాలు ఛిద్రం..

విజయనగరం క్రైమ్: యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ చూడాలని రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు అన్నారు. ధర్మపురి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత తరుణంలో యువత ఎక్కువగా గంజాయి బారిన పడి చేతులారా జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఒక పక్క అనారోగ్యంతో పాటూ మరో పక్క మత్తుపదార్థాలను వినియోగించినందుకు జైలుశిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుందన్నారు. గంజాయి, కొకైన్ వంటి మాదకద్రవ్యాలను ఎవరైనా ఉపయోగిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 14500, 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై గణేష్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశం అభివృద్ధి చెందింది..



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మనోజ్ పటకర్

● విజయనగరం విజయోత్సవాల సభలో బీజేపీ నాయకులు

విజయనగరం గంటస్తంభం: భారతీయ జనతా పార్టీ తొమ్మిదేళ్ల పరిపాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందని పలువురు బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. తొమ్మిదేళ్ల పాలన ముగిసిన సందర్భంగా విజయనగరం రంజని థియేటర్ కూడలిలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు మనోజ్ పటకర్, జీఎల్ నరసింహారావు మాట్లాడుతూ, దేశంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీదేనని కొనియాడారు. తీవ్రవాద అణచివేతలో ఆయన సఫలీకృతమయ్యారన్నారు. 400 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న అయోధ్య రామమందిరం సమస్యను కొలిక్కి తీసుకొచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని చెప్పారు. రాష్ట్రానికి మెడికల్ కాలేజీ, గిరిజన యూనివర్సిటీలు మంజూరు చేసిన చరిత్ర తమదన్నారు. పలు రాష్ట్రాల్లో ఉగ్రవాద చర్యలను తిప్పికొట్టిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో కూడా మట్టి మాఫీయాను అణచివేస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలి



వైద్య కళాశాల నిర్మాణ పనులపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

● కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. గాజులరేగ వద్ద నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు అవసరమైన సిబ్బందిని, సామగ్రిని త్వరితగతిన సమీకరించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యుదీకరణ, వైరింగ్, తాగునీటి పైపులైన్లు, ఆడియో, వీడియో పరికరాల ఏర్పాటు వంటి అంశాలపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, హాస్టల్ బ్లాక్‌ల నిర్మాణం గడువులోగా పూర్తి చేస్తామని ఏపీఎంఎస్ఎంఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కళాశాల వరకు రోడ్డు నిర్మాణంపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రుపొందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల, ఏపీఎంఎస్ఎంఐడీసీ ఎస్ఈ అంకమ్మ చౌదరి, ఈఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

● ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



మొయిద గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రెండు కళ్లు లాంటివని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ఎమ్మెల్సీ స్వగ్రామమైన మొయిదలోని జంగాలవీధిలో సీసీ డ్రైయిన్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గడప గడపకు.. కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో రాష్ట్రం దేశంలోనే ముందు వరుసలో ఉందన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, సచివాలయ కన్వీనర్ అట్టాడ శ్రీనివాసరావు, ధవళ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

● ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఎస్ఈ రాజారావు



మధుపాడ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పరిస్థితిని అడిగితెలుసుకుంటున్న ఎస్ఈ రాజారావు

విజయనగరం: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఎస్ఈ కె.రాజారావు ఆదేశించారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. నగర ప్రజలకు తాగునీటిని అందించే మధుపాడ హెడ్ వాటర్ వర్క్స్ మోటార్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో చేపడుతున్న అర్బన్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు, గార్బేజ్ ట్రాన్సిట్ స్టేషన్, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులు, పెద్ద చెరువు అభివృద్ధి పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న మంచినీటి ట్యాంక్ పనులను సంబంధిత అధికారులతో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి పనులు సకాలంలో ప్రారంభించడంలో భాగంగా అవసరమైన టెండర్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రారంభించిన పనులు నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పర్యటనలో ఆయన వెంట కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, డీఈఈ ఎస్.అప్పారావు, ఏఈలు పాల్గొన్నారు.

వాడుక నీరు వేరే మార్గంలో మళ్లించాలి



సభలో మాట్లాడుతున్న భీమాసేన్ వార్ అధ్యక్షుడు డీఎస్ఆర్ వేమున

భోగాపురం: ముంజేరు గ్రామస్తుల వాడుక నీరు సిద్ధార్థనగర్ కాలనీ మీదుగా కాకుండా వేరే మార్గం ద్వారా బయటకు మళ్లించాలని భీమాసేన్ వార్ అధ్యక్షుడు (విశాఖపట్నం) డీఎస్ఆర్ మేమున డిమాండ్ చేశారు. సిద్ధార్థనగర్ కాలనీలో ఎద్దు బాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎస్సీ సంఘాల సంఘీభావ ఐక్యవేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వాడుకనీరు గతంలో ఆర్అండ్‌బీ రహదారి పక్క నుంచి సమీప చెరువులోకి చేరేదని, ఆ మార్గంలోనే కాలువ నిర్మాణం చేపట్టి వాడుక నీటిని మళ్లించాలని కోరారు. అలాకాకుండా కాలనీ మీదుగా కాలువ నిర్మాణం చేపట్టినట్లైతే దళితులందరం కలిసి రోడ్డెక్కి ఉద్యమం బాట పట్టాల్సి ఉంటుందని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో భీమాసేన్ వార్ సభ్యులు రాజేంద్రప్రసాద్, నర్ర చంద్రశేఖర్, గదం మహేష్, బీవీ రమణ, పాకలతోట ఉదయ్‌భాస్కర్, గంటాన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



డీవీఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణను ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు గురువారం పరామర్శించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారాయణ పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు యడ్ల గోవింద, సర్పంచ్ అట్టాడ కృష్ణ ఉన్నారు.

డీవీఎస్‌కు నివాళి..

నెల్లిమర్ల: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల దర్శకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు డీవీ సత్యనారాయణకు ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) గురువారం నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన సత్యనారాయణ సంస్మరణ కార్యక్రమాన్ని స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మంటపంలో గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్సీ వెంట గంటా అప్పలరాజు, తదితరులున్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

● కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలో వర్షాలు కురిసే సమయంలో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ఆర్. శ్రీరాములునాయుడు ఆదేశించారు. గురువారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలు కురిసే సమయంలో వర్షపు నీరు రహదారులపై నిలిచిపోకుండా, ముందస్తుగానే నీటి ప్రవాహ మార్గాలను గుర్తించి పరిశుభ్ర పరచాలని సూచించారు. చెరువులు, కుంటల వైపు నీరు పారేవిధంగా మార్గాలను ప్రక్షాళన చేయాలన్నారు. పెద్ద చెరువు చుట్టూ ఉన్న తొమ్మిది నీటి ప్రవాహపు మార్గాలని జేసీబీల సహాయంతో శుభ్రపరచాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే క్లాప్ యూజర్ చార్జీల వసూళ్లలో నగర పాలక సంస్థ చివరి స్థానంలో ఉందని, దీన్ని సరిదిద్దాలని సూచించారు. ఇచ్చిన మార్గదర్శకాలు, లక్ష్యాల ప్రకారం క్లాప్ యూజర్ చార్జీల వసూళ్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు.